# పిచ్చి పిచ్చి పిచ్చి

బోడపాటి రమేష్

"నీ అంతు చూస్తాను."

"నీ వల్ల కాదు"

"పెద్దంతరం, చిన్నంతరం లేకుండా ఏమిటా మాటలు"

"........................"

"ఏంటా చూపు? మా అబ్బాయి నీ చుట్టూ తిరుగుతున్నాడని మురిసిపోకు. నువ్వు మా వాడితో కాపురం ఎలా చేస్తావో చూస్తాను."

"ఆ మాటనటానికి సిగ్గుండాలి"

"అంటే నాకు సిగ్గు లేదనా"

నల్లజుట్టు పాత్రధారి హూంకరిస్తోంది.

"అంత సిగ్గున్నదానివయితే మా మామగారెవరో చెప్పు.

తెల్లజుట్టు పాత్రధారి నిలదీస్తోంది.

ఇద్దరూ ఒడ్డూ పొడుగూ సమానంగానే వున్నారు. లావుకూడా అంతే. (సన్నగా వుంటే వెండితెర, లావయితే బుల్లితెర).



మెడనిండా నగలు, పట్టు చీరలు, అత్తగారు స్లీవ్‌లెస్ జాకెట్టు, నల్లజుట్టూ

కోడలు పొడుగు చేతుల జాకెట్టు, తెల్లజుట్టు అదే వెరైటీ.

పైన చెప్పిన విధంగా జుట్టురంగును బట్టి వరసలు నిర్ధారించవలసి వస్తోంది.

ఇది టి.వీ సీరియల్స్‌లో నడుస్తున్న ఎపిసోడ్.

అప్పటివరకు కాళ్లు కిందబెట్టి కూర్చున్న కమలమ్మకు మోకాళ్ల నెప్పులు గుర్తొచ్చి కాళ్లు స్టూలు మీద పెట్టుకుని సోఫాలో వెనక్కి వాలిపోయింది.

ఇది ఆవిడ అభిమానంగా చూసే సీరియల్. ఎన్నేళ్ల నుంచీ వస్తోందో గుర్తులేదు. బహుశా అమ్ములు (అంటే కూతురు) పెళ్లయిన కొత్తల్లో ప్రారంభమయినట్లు గుర్తు. అన్నట్లు అమ్ములు అత్తారింట్లో ఎట్లావుందో అని ఒక్క క్షణం అనిపించినా తెరమీద కనబడే అత్తాకోడళ్ల వివాదంలో మునిగిపోయింది.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. ఈ సీరియల్ వచ్చే టైంలో ఎవరొస్తారా అని ఊరుకుంది. అదీగాక ఎవరయినా వస్తే చికాకు కూడా కద్దు. అయినా బెల్ మోగటం ఆగకపోవటంతో ఇక తప్పదనుకుని లేచింది.

తలుపు తీసిన ఆమెకు ''బాగున్నారా అమ్మా'' అంటూ అమ్ములు కనబడింది.

తల్లినుంచి ఉలుకు పలుకు లేదు. ఎందుకంటే ఆవిడ టి.వి ముందు కూలబడింది.

తెలిసిన ఇల్లే కావటంతో ఆ అమ్మాయే ఫ్రిజ్‌లో నీళ్లు తాగి స్థిమిత పడింది.

సీరియల్ పూర్తయిన తర్వాత కమలమ్మ లేవబోయింది. అయితే కాళ్లు పైకెత్తి కూర్చోవడం వల్ల తిమ్మిరెక్కి అడుగు పడటం లేదు.

''ఏమిటమ్మా ఒంట్లో బాగుండడం లేదా''

''ఒకటే మోకాళ్ల నొప్పులు''

''డాక్టర్ దగ్గరకు వెళ్లావా''

''ఎక్కడే కుదరటం లేదు''

అంత కుదరక పోవటానికి కారణం కూతురికి అంతు పట్టలేదు.

''నువ్వెప్పుడూ ఇంతే. నీ గురించి పట్టించుకోవు'' అన్నది అమ్ములు.

కూతురి అభిమానానికి మురిసిపోయింది తల్లి. ఇద్దరూ కబుర్లలో పడిపోయారు.

''అతనేడే'' అన్నది ఏదో గుర్తొచ్చినట్టుగా కమలమ్మ.

అప్పుడు గుర్తొచ్చింది కమలమ్మకు అల్లుడు రాలేదని.

''ఆయనకు శలవు దొరక లేదమ్మా'!

''నీతో రావటానికి శలవు దొరక్కపోవట మేమిటే మరీ విడ్డూరం కాకపోతే''

''అతను నిన్ను బాగా చూసుకుంటున్నాడా''

అమ్ములుకు నవ్వొచ్చింది. ఎందుకంటే భర్త తనను దగ్గరకు తీసుకున్నప్పుడల్లా ''బాగా చూసుకోవడమంటే ఇదే'' అంటాడు.

'ఛీ ఫో అమ్మా' అని ఈ కాలం పిల్లయినా సిగ్గుపడిపోయింది అది గుర్తొచ్చి.

''అత్తగారెట్లా వున్నారమ్మా''

''ఆవిడకే ఈ మధ్య బొత్తిగా బావుండటం లేదు. మామగారు పోవటంతో ఇంకా డీలా పడిపోయారు. డాక్టరుకు చూపించి మందులు వాడుతున్నాం. అందులో నేనిక్కడికి వచ్చానేమో, ఆవిడకి ఇంకా ఇబ్బంది.''

ఇది తల్లికి నచ్చిన సమాధానం కాదు.

''ఆవిడకేం పిడిరాయిలా బాగానే వుంటుంది. ఆవిడకు చేసి చేసి నువ్వెలా అయిపోయావో చూసుకున్నావా''

''నాకేవమ్మా, నేను బాగానే వున్నాను. ఆవిడ నన్ను ఏ పనీ చెయ్యనివ్వదు''

తల్లిముఖంలో సంతోషం.

''వరుసకు అత్తగారయినా నన్ను తల్లిలా చూసుకుంటుంది''

తల్లిముఖంలో సంతోషం మాయమయింది

అలా వుండకూడదే అని గొణుక్కుంది. అమ్ములుకి తల్లి అర్థం కావటం లేదు.



## బ్రేక్ రాని ఇషా

కంపెనీ సినిమాలో 'ఖల్లాస్' పిల్లగా బాలీవుడ్‌లోకి ప్రవేశించి గర్ల్‌ఫ్రెండ్‌లో లెస్బియన్‌గా నటించి సంచలనం సృష్టించిన ఇషా కొప్పికర్ వయసు 28 ఏళ్లు. మోడలింగ్‌లో కెరీర్ ప్రారంభించిన ఇషా, 1995లో మిస్ ఇండియా పోటీల్లో 'మిస్ టాలెంట్ క్రేన్' టైటిల్ గెలుచుకోవడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. మొదట్లో తమిళ సినిమాలో నటించినా అక్కడ ఆశించినంత పేరు రాలేదు. తరువాత బాలీవుడ్ ప్రవేశం జరిగింది. అయినా ఆశించినంత బ్రేక్ రాలేదు



బ్రెజిల్ రాజధాని రియో డిజెనోరోలోని ఓ వ్యాపార భవన సముదాయమిది. నలభై అంతస్తుల ఈ భవనం బ్రెజిల్‌కే తల మానికంగా వుంటుంది. ఇంత కన్నా ఎత్తున్న భవనాలున్నా ఇది మాత్రం అద్భుత కట్టడంగా విలసిల్లుతోంది.

''ఏం నాన్నా బాగున్నారా'' అన్నది అమ్ములు ఇంట్లోకి వస్తున్న తండ్రిని చూసి.

''ఎంత సేపయిందమ్మా వచ్చి, బావున్నావా?''అన్నాడాయన ఆప్యాయంగా.

''ఇంతసేపూ ఎక్కడ తిరుగుతున్నారు నాన్నా''

ఆయన ఓ వెర్రినవ్వు నవ్వాడు. ఎందుకంటే ఆయన రోజూ రాత్రిళ్లు టీ.వీ సీరియళ్లు అయిపోయేదాకా ఇంటికి రాకుండా అలవాటు చేసుకున్నాడు. ఒకవేళ వచ్చినా, ఆయన తనే అన్నం పెట్టుకు తినేసి తన గదిలోకి వెళ్లి తోచిన పుస్తకాలు చదువుకుని పడుకుంటాడు. భార్య(?) అన్ని సీరియళ్లు చూసి ఎప్పుడు పడుకుంటుందో!

* * *

''నేనిక బయలుదేరతానమ్మా'' అన్నది అమ్ములు ఒకరోజు.

''అదేమిటే, వచ్చి నెలరోజులయినా కాలేదు అప్పుడే బయలుదేరాలంటావు'' అన్నది తల్లి.

''లేదమ్మా, నేనిక్కడుంటే ఆయనకు ఇబ్బంది. అసలే మా అత్తగారికి కూడా బాగుండటం లేదు. అనవసరంగా ఇన్నిరోజులు ఇక్కడే వుండిపోయాను''అమ్ములు బాధపడుతూ అంది.

''పోన్లే అమ్మా, ఇవాళే రిజర్వేషన్ చేయిస్తాను'' అన్నాడు తండ్రి బాధ్యతగా.

'ఎంతసేపూ అత్తగారి యావే' అనుకుంది కమలమ్మ కసిగా.

తల్లి విసుగు చూసిన అమ్ములుకు విషయం అర్థం కాలేదు. బహుశా తన మీద అభిమానం కాబోలనుకుని నవ్వుకుంది పిచ్చిపిల్ల.

అయితే తల్లి కూడా తనకూతురు పిచ్చిపిల్లే అనుకుంది ఆచరణలో భాగంగా.

''ఇవాళ డాక్టర్ దగ్గరకు వెళదాం పద'' అన్నది కూతురితో.

''నాకేమిటీ, నేను బాగానే వున్నాను కదా'' అన్నది అమ్ములు.

కమలమ్మ నవ్వి ఊరుకుంది.

నగరంలో పేరుమోసిన డాక్టర్ దగ్గరకు వెళ్లారు తల్లీకూతుళ్లు.

డాక్టర్ బోర్డు చూసిన అమ్ములు తెల్లబోయింది.

'' ఇదేమిటమ్మా, ఇక్కడకు తీసుకొచ్చావు''

''నోరు మూసుకుని పద'' తల్లి గదమాయించింది.

రోడ్డుమీద నలుగురూ చూస్తే బాగుండదని తల్లిమీద కోపం వచ్చినా తమాయించుకుని ఆమె వెనకే క్లినిక్‌లోకి వెళ్లింది. అయితే తను ఈ డాక్టర్ దగ్గరకు రావలసిన అవసరం ఏమిటో అర్థం కాలేదు.

కాసేపటికి వీరి వంతు వచ్చింది. తల్లీ కూతురు లోపలికి వెళ్లారు.

టేబుల్ మీద డాక్టర్ పేరు, సైకియాట్రీలో ఆయనకున్న డిగ్రీల వివరాలు వున్నాయి.

''మా అమ్మాయిని మీకు చూపిద్దామని వచ్చాం డాక్టర్ గారూ,'' అన్నది కమలమ్మ.

అమ్ములు వైపు తిరిగి ప్రశ్నలు ప్రారంభించారాయన.

''మీకు పెళ్లయిందా,''

అవునన్నట్టు తలూపింది.

''పిల్లలెంతమంది''

''ఇప్పట్లో వద్దనుకున్నాం.''

'' మీవారు మీతో ఎట్లా వుంటారు''

బాగానే వుంటారు.

''మీరు అవతలకు వెళ్లండమ్మా''అంటూ కమలమ్మను బయటకు పంపించేశాడు.

''బాగానే వుండటమంటే'' అన్నాడాయన .

''ఆయన నన్ను బాగానే చూసుకుంటారు'' నవ్వొచ్చినా, డాక్టర్ దగ్గర బాగుండదని ఆపుకుంది.

''అంటే సెక్స్‌పరంగా'' అన్నాడాయన వృత్తిధర్మంగా.

''నాకేం ఇబ్బంది లేదు'' అన్నది అమ్ములు స్థిరంగా.

'' ఆయనకేమైనా వైసెస్ ఐ మీన్ డ్రింకింగ్....

'' ఛఛ అలాంటివేమీ లేవు.''

''మరయితే నా దగ్గరకెందుకొచ్చారు?''

''అదే నాకూ అర్థం కావట్లేదు డాక్టర్'' అన్నది అమ్ములు అమాయకంగా.

డాక్టర్‌కు ఈ కేసు మీద ఉత్సుకత ఎక్కువయింది. కమలమ్మను లోపలికి రమ్మన్నాడు.

''మీ అమ్మాయి పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్. మీరు వెళ్లవచ్చు.

అమ్ములు లేచింది కానీ కమలమ్మ కదలటం లేదు.

''ఇంకేమయినా చెప్పాల్సింది ఉందా'' అన్నట్లు చూశాడాయన.

''మా అమ్మాయి ఉత్త పిచ్చిది డాక్టర్ గారూ'' అన్నది కమలమ్మ.

''వాడ్డూయూ మీన్, మీ అమ్మాయికి అలాంటిదేమీ లేదు నేను చెప్పాను కదా'' ఆయనలో అసహనం ఎక్కువవుతోంది. బయట చాలామంది పేషెంట్లు ఉన్నారు.

''ఎందుకంటే పెళ్లయి ఇన్నేళ్లయినా మా అమ్మాయి, అత్తగారు కలిసే వుంటున్నారు. ఎటువంటి గొడవలూ లేవు. అసలు అత్త కోడళ్లు పోట్లాడుకోకుండా ఎట్లా వుంటారు? పైగా ఆవిడ తన సొంతబిడ్డలా చూసుకుంటోందని మా అమ్మాయి అంటోంది. ఇక్కడికొచ్చినా, ఎప్పుడూ అత్తగారి గురించి మంచిగానే చెబుతుంటుంది. ఇది పిచ్చికాదంటారా'' అన్నది కమలమ్మ దీర్ఘాలు తీస్తూ.

డాక్టర్ పెద్దగా నవ్వాడు. ఆయనకు పొరలు పొరలుగా నవ్వొస్తోంది.

అప్పుడు ఆయనకు కేసు అర్థమయింది. కేస్ షీట్ మీద కమలమ్మ అని రాశాడు. ★